# భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)
# కేంద్ర కమిటీ

## ఐక్యంగా సంఘటితంగా పోరాడి, ప్రపంచ సామ్రాజ్యవాద వ్యవస్థను ధ్వంసం చేయండి !
## ప్రపంచ సోషలిస్టు వ్యవస్థ నిర్మాణానికై పురోగమించండి !!
## మేడే ప్రకటన

**ఏప్రిల్ 15, 2018**

ప్రపంచ కార్మికవర్గం ఈ సంవత్సరం కార్ల్ మార్క్స్ ద్విశతాబ్ది జయంత్యుత్సవాలు జరుపుకోబోతున్నది. రెండు శతాబ్దాల క్రితం పెట్టుబడిదారీ విధానం ఇంకా అభివృద్ధి చెందుతున్న దశలో పుట్టిన మార్క్స్ ఆ కాలపు సామాజిక పరిస్థితులను, వర్గ పోరాటాలనూ అధ్యయనం చేసి, జర్మన్ తత్వశాస్త్రం, ఇంగ్లీష్ రాజకీయ అర్థశాస్త్రం, ఫ్రెంచి సోషలిజాలలో ఉత్తమమైన అంశాలను జోడించి, కార్మికవర్గానికి అత్యంత పురోగామి ఆయుధాన్ని సృష్టించాడు. ఇది ప్రపంచాన్ని వివరించడానికి మాత్రమే కాకుండా మార్చడం కోసం ఉపయోగపడే ఆయుధం. దీని ఫలితమే శాస్త్రీయ సోషలిజం. మొట్టమొదటిసారిగా ఇది శాస్త్రీయమైన పునాది మీద సోషలిస్టు విప్లవకర సిద్ధాంతాన్ని కార్మికవర్గ ఆచరణాత్మక ఉద్యమంతో సమైక్యం చేసింది. పెట్టుబడిదారీ ఉత్పత్తి విధాన అభివృద్ధి గురించి జీవిత కాలం చేసిన పరిశోధనతో మార్క్స్ సామాజిక అభివృద్ధి మౌలిక నియమాలను కనుగొన్నాడు. మానవాళి ఎదుర్కొంటున్న క్లిష్టమైన ప్రశ్నలకు జవాబులు అందించాడు. వర్గాలు వర్గ బానిసత్వం లేని ఒక నూతన సమాజాన్ని నిర్మించే ప్రపంచ చారిత్రక కార్యక్రమాన్ని పరిపూర్తి చేయడం కోసం కార్మికవర్గానికి ఒక సిద్ధాంతాన్ని రూపొందించి ఇచ్చాడు. మార్క్సిజం ఆవిర్భావం భూమిని కుదిపివేసింది. ఇది మానవ విజ్ఞాన అభివృద్ధిలో ఒక సంపూర్ణ విప్లవం. మానవ చరిత్రలో ఒక నూతన యుగ ఉషోదయం.

బూర్జువా వర్గ, కార్మికవర్గ ప్రయోజనాలు ఎంత మాత్రం పొసగవు అని మార్క్స్ బోధనలు రుజువుపరిచాయి. బూర్జువా వర్గం దాని మిత్రులకు, వర్గ పోరాటం చేస్తున్న కార్మికవర్గం దాని మిత్రులకూ మధ్య మార్క్సిజం స్పష్టమైన విభజన రేఖ గీసింది. పెట్టుబడిదారీ విధానం అనివార్యంగా పతనం అవుతుందని, అంతే అనివార్యంగా ఆ స్థానంలో కమ్యూనిజం ఆవిర్భవిస్తుందని తేటతెల్లం చేసింది. మొదటి దశలో పెట్టుబడిదారీ విధానం ఉత్పత్తి శక్తులను అభివృద్ధి చేసింది, ఒక సాధారణ ప్రగతిశీల పాత్ర వహించింది. పెట్టుబడిదారీ విధానం మొదటి దశలో ఎరుగని స్థాయిలో, లాభాల అన్వేషణలో సామ్రాజ్యవాదం దోపిడీ, పీడన, యుద్ధాలు, ఉత్పత్తి శక్తులను నాశనం చేస్తున్నది. ప్రపంచంలో అత్యధిక దేశాలను, జాతులను, ప్రజలను సామ్రాజ్యవాదం బానిసత్వంలోకి నెట్టి లోబరచుకుంది. కోట్లాది శ్రామిక ప్రజానీకాన్ని చెప్పరాని వేదనలో, కష్టాలలో ముంచింది. మరో పక్క పెట్టుబడిదారీ విధాన మొదటి దశలో కార్మికవర్గం ఇంకా సాపేక్షికంగా బలహీనంగా, బూర్జువా వర్గం పై పోరాటంలో ఇంకా అసంఘటితంగా, అనుభవరహితంగా ఉన్నప్పటికీ సామ్రాజ్యవాద యుగంలో మొట్టమొదటిసారిగా కార్మికవర్గం బలంగా, సంఘటితంగా రూపొంది, పాలక వర్గ స్థానానికి ఎగిసేందుకు అవసరమైనంత అనుభవం గడించింది. పాత రాజ్యాంగ యంత్రాంగాన్ని విధ్వంసం గావించి మానవ చరిత్రలో కనీ వినీ ఎరుగని ఒక సంపూర్ణ నూతన రాజ్యమైన కార్మికవర్గ నియంతృత్వాన్ని నెలకొల్పింది. మొట్టమొదటిసారిగా రష్యాలో లెనిన్ నాయకత్వంలో అక్టోబరు విప్లవం మార్క్సిజం పతాకను విజయవంతంగా ఎగురవేసింది.

కార్మికవర్గం మార్క్సిజంతో సాయుధమయినప్పుడు అది ఒక భౌతిక శక్తిగా పరివర్తన చెందగలదని ఇరవయ్యో శతాబ్దంలో విజయవంతమైన కార్మికవర్గ విప్లవాలు స్పష్టం చేశాయి. అప్పుడు కార్మికవర్గం బూర్జువా వర్గ, సమస్త పీడకుల పాలనను తుడిచివేయడమే కాకుండా అంతే స్థాయిలో పీడితుల పాలనను సృజనాత్మకంగా నిర్మించగలదు. రాజ్యాధికారం నెలకొల్పిన కార్మికవర్గం దోపిడీ పాలక వర్గాల అన్ని రకాల ప్రతీఘాతుక, శిథిల, మరణోన్ముఖ ఆర్థికాన్ని, రాజకీయాన్ని, సంస్కృతిని, భావజాలాన్ని, సంప్రదాయాన్ని, నైతికతనూ నిర్మూలించి, ఆ స్థానంలో ఒక సుదీర్ఘ పరివర్తనా క్రమంలో సంపూర్ణమైన నూతన, ప్రగతిశీల ఆర్థికాన్ని, రాజకీయాన్ని, సంస్కృతిని, భావజాలాన్ని, సంప్రదాయాలను, నైతికతనూ సృష్టించగలదని స్పష్టం చేసింది. నికృష్టంగా బతుకుతున్న ప్రజలు వేతన బానిసత్వం నుంచి విముక్తి పొంది మొట్టమొదటిసారిగా ప్రతీఘాతుక వర్గాల నియంతృత్వంలో ఉత్తగా బూర్జువా పడికట్టు పదాలుగా ఉన్న స్వేచ్ఛా, సమానత్వం, సౌహార్దత, ప్రజాస్వామ్యాలను ఈ నూతన సమాజంలో అనుభవించారు.

అత్యంత పురోగామి మార్క్సిజం, ఇప్పుడు మార్క్సిజం-లెనినిజం-మావోయిజం అనే సిద్ధాంతంతో సాయుధమై, ఒకటిన్నరకు పైగా

శతాబ్దాలుగా విప్లవానుభవంతో సుసంపన్నం అయినప్పటికీ ఇవాళ ప్రపంచ కార్మికవర్గం బలహీనంగా, అసంఘటితంగా ఉన్నది. బూర్జువా వర్గం ఇప్పటికి నిర్మాణపరంగా, భౌతికంగా శక్తివంతంగా ఉన్నది. ఒకప్పుడు శక్తివంతంగా ఉన్న సోషలిస్టు శిబిరం ప్రధానంగా అన్ని రకాల రివిజనిస్టులు, నయా రివిజనిస్టుల విద్రోహాల వల్ల కూలిపోయిన నాటి నుంచి ప్రతి చోటా వర్గ శత్రువు అధికారంలోకి వచ్చాడు. విప్లవ కార్మికవర్గ శిబిరం నిర్మాణపరంగా బలహీనంగా ఉండడాన్ని అవకాశంగా తీసుకుని వర్గ శత్రువు ప్రజలను నిర్దాక్షిణ్యంగా అణచివేస్తున్నాడు. నిజమైన కమ్యూనిస్టు పార్టీల నాయకత్వంలో విప్లవ పోరాటాలు జరుగుతున్న దేశాలలో కూడా సామ్రాజ్యవాదులు, దేశీయ ప్రతీఘాతుక పాలకులూ పాత సమాజపు ప్రతీఘాతుక రాజకీయాలను, సంస్కృతినీ కాపాలని ముందుకు తెస్తున్నారు. ప్రజలను విభజించి ఉంచడానికి, వారిని లోబరుచుకోవడానికీ సామాజిక దురాచారాలను వాడుకుంటారు. అయితే పీడిత ప్రజలు నిజమైన ప్రజాస్వామ్యాన్ని, స్వాతంత్ర్యాన్ని, సౌభ్రాతృత్వాన్ని, సమానత్వాన్ని కోరుకుంటారు; సమస్త దోపిడీ, పీడనా, వివక్షా, అవమాన రూపాల నుంచి స్వేచ్ఛను ఆశిస్తారు; వాటి కోసం పోరాటం కూడా చేస్తారు. అయితే వర్గ సమాజం ఏర్పడిన తరువాత, పెట్టుబడిదారీ విధానం సామ్రాజ్యవాదంగా పరివర్తన చెంది, ముఖ్యంగా గత శతాబ్దంలో సోషలిజం తాత్కాలిక ఓటమి చెందిన తరువాత తిరిగి వాటి సాధనకు ఇక కార్మికవర్గ విప్లవాలు మినహా మరో విముక్తి మార్గం లేదు. సోషలిస్టు శిబిరాన్ని నష్టపోయిన తరువాత నేడు అటువంటి విప్లవాలు చేయడం ఒక సవాలుగానే ఉన్నది. ప్రస్తుత కాలం అక్టోబరు విప్లవానికి ముందటి పరిస్థితిలా ఉన్నది. ఏమైనప్పటికీ పీడితుల ఆర్థిక బానిసత్వాన్నే కాకుండా వారి భావజాల, సాంస్కృతిక బానిసత్వం ఏదైతే వారి సుందర భవిష్యత్తు స్వప్నాలను సయితం వదులుకునేలా చేస్తుందో దాని అంతానికై కార్మికవర్గ విప్లవాల అవసరం గతంలో ఎంత ఉన్నదో ఇప్పుడూ అంతగానూ ఉన్నది.

గడచిన నాలుగు దశాబ్దాల సామ్రాజ్యవాద నయా ఉదారవాద విధానంలో ఎన్నడూ లేని స్థాయికి చేరుకున్న పెట్టుబడిదారీ ప్రపంచ ఆర్థిక వ్యవస్థ విస్తరణ వల్ల సామ్రాజ్యవాదానికి పీడిత జాతులు ప్రజలకు మధ్య, బూర్జువా వర్గానికి కార్మికవర్గానికి మధ్య, సామ్రాజ్యవాద శక్తుల మధ్యనూ అంతర్గత వైరుధ్యాలు తీవ్ర స్థాయికి చేరుకున్నాయి. పీడిత జాతుల మీద, ప్రజల మీదా సామ్రాజ్యవాద దురాక్రమణ, శ్రమ పై పెట్టుబడి దాడి కూడా ప్రపంచవ్యాప్తంగా పెరిగాయి. దీంతో కార్మికవర్గం, రైతాంగం, మధ్య తరగతి ప్రజలు, మహిళలు, మతపర అల్పసంఖ్యాక వర్గాలు, పీడిత జాతులు, జాతి వివక్ష ఎదుర్కొంటున్న జాతులు, ఇతర సమూహాలూ మొదలయిన ప్రజలంతా మరింత తీవ్రమైన ఆర్థిక, రాజకీయ, సామాజిక, సాంస్కృతిక దోపిడీ పీడనలకు గురవుతున్నారు. ఉన్నవారికి లేనివారికీ మధ్య తారతమ్యం, గతంలో ఎన్నడూ లేని స్థాయికి చేరుకున్నది. సామ్రాజ్యవాద 'ప్రపంచీకరణ' పరాన్నభుక్కు, పీల్చి పిప్పి చేసే, విధ్వంసక స్వభావం శ్రామిక ప్రజలకు మరింత వేదనాభరితంగా తయారవుతూ వారిని అన్ని రకాల బానిసత్వాల నుంచి బయటపడే మార్గం వెతుక్కునే విధంగా నెడుతున్నది. ప్రస్తుత ప్రపంచ పెట్టుబడిదారీ విధాన సంక్షోభం కార్మిక ప్రజలకు చెప్పరాని యాతనలను, కష్టాలను తీసుకురావడమే కాకుండా విప్లవానికి నూతన అవకాశాలను కూడా సృష్టిస్తుంది. మన దేశంలో, ప్రపంచంలో కార్మికవర్గం విముక్తి కోసం చేసే పోరాటంలో ఈ అనుకూల పరిస్థితిని వినియోగించుకునే పద్ధతులు, సాధనాలను గురించి తీవ్రంగా, లోతుగా ఆలోచించడం అవసరం.

మన దేశంలో కూడా కార్మికవర్గం, సమస్త పీడిత వర్గాలు, సామాజిక సెక్షన్‌లూ సామ్రాజ్యవాద దన్నుతో బ్రాహ్మణీయ హిందూ ఫాసిజం రూపంలో పాలక వర్గాల క్రూర దాడిని ఎదుర్కొంటున్నాయి. ఆర్‌ఎస్‌ఎస్–భాజపాల నాయకత్వంలో, నిర్బంధపూరిత రాజ్యాంగ యంత్రాంగం సహాయంతో, దేశమంతటా వివిధ రూపాలలో దోపిడీ పీడనలు తీవ్రతరమవుతున్నాయి. సామ్రాజ్యవాదుల, దేశీయ పాలక వర్గాల దురాక్రమణపూరిత దోపిడీని పాలక వర్గాలు మరింతగా సుగమం చేస్తున్నాయి. దేశాన్ని 'హిందూ రాష్ట్రం'గా, ఒక మహా శక్తిగా మార్చివేసే తమ దీర్ఘకాల లక్ష్యంలో భాగంగా మోడీ నేతృత్వంలో ఎన్‌డిఎ ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వాలూ కార్మికులు, కర్షకులు, ఉద్యోగులు, చిన్న, మధ్య తరహా వ్యాపారులు, నిరుద్యోగులు, విద్యార్థులు, యువత, దళితులు, ఆదివాసులు, మహిళలు, మతపర అల్పసంఖ్యాకులు, పీడిత జాతులు, పర్యావరణవాదులు మొదలయిన వారి ప్రజాస్వామిక ఉద్యమాలను అణచివేస్తున్నది. ఇందులో ఒక ముఖ్య భాగంగా దేశంలో ఈ సమస్త పీడిత వర్గాలు, సెక్షన్‌లకు ఆశాకిరణంగా ఉన్న మావోయిస్టు ఉద్యమం పై కూడా తీవ్రమైన విప్లవ ప్రతీఘాతుక దాడి జరుగుతున్నది. సారాంశంలో ఇవన్నీ వర్గ పీడన, వర్గ యుద్ధ ప్రత్యక్ష, పరోక్ష రూపాలే.

గత ప్రపంచ యుద్ధం నాటి నుంచి సామ్రాజ్యవాదులు కార్మిక ప్రజలకు వ్యతిరేకంగా వర్గ యుద్ధాన్ని, విప్లవ, జాతి విముక్తి, ప్రజాస్వామిక ఉద్యమాలకు వ్యతిరేకంగా బహిరంగ, రహస్య విప్లవ ప్రతీఘాతుక యుద్ధాలనూ క్షణమాత్రం కూడా విడవలేదు. ఆఫ్ఘనిస్తాన్, ఇరాక్, లిబియా, సిరియా, యెమెన్ వంటి దేశాలలో గడచిన అర్ధ శతాబ్దంగా కనిపించే, కనిపించని అన్యాయ దురాక్రమణ యుద్ధాలు, 'ప్రభుత్వాలు మార్చడం', సైనిక తిరుగుబాట్లూ ఇందుకు స్పష్టమైన ఉదాహరణలు. ఇప్పుడు కొత్తగా దిగుమతి సుంకాల పెంపు, వ్యాపార యుద్ధాలు, దౌత్య ఘర్షణలు, ఆంక్షలు, సైనికంగా రెచ్చగొట్టడాలు, జోక్యాలు, దురాక్రమణల ద్వారా సామ్రాజ్యవాద శక్తులు ప్రజలను ఒక నూతన సామ్రాజ్యవాద యుద్ధం వైపుగా నెడుతున్నాయి. 1930ల నాటి 'మహామాంద్యం' తరువాత తిరిగి ఏర్పడిన అంతటి తీవ్రమైన ఆర్థిక సంక్షోభాన్ని అధిగమించేందుకు సామ్రాజ్యవాద శక్తులు ఒకదాని పై మరొకటి యుద్ధానికి సన్నద్ధమవుతున్నాయి. నూతన సామ్రాజ్యవాద యుద్ధాలు బద్దలు కావడానికి వ్యతిరేకంగాను, అటువంటి యుద్ధాలు బద్దలయితే రాజకీయాధికారం స్వాధీనం చేసుకునే లక్ష్యంతో వాటిని తమ దేశాలలో విప్లవ అంతర్యుద్ధాలుగా మార్చడానికీ ప్రజలను సంఘటితం చేయవలసిన విప్లవ బాధ్యత నేడు సమస్త దేశాల కార్మికవర్గం

పై మరోసారి పడింది. విశాల ప్రజానీకాన్ని సమరశీలంగా చొరవగా సంఘటితం చేయడం ద్వారానే కార్మికవర్గం, వివిధ దేశాలలో దాని అగ్రగామి పార్టీలూ నిష్క్రియత్వాన్ని అధిగమించి, ప్రేక్షక మాత్రంగా ఉండకుండా రాజకీయ రంగంలో మరింత ప్రభావవంతంగా జోక్యం చేసుకోగలుగుతాయి, సామ్రాజ్యవాద సంక్షోభాలను, యుద్ధాలను విప్లవం కోసం ఉపయోగించుకోగలుగుతాయి.

ఈ మహా కర్తవ్యాన్ని నెరవేర్చడం కోసం ప్రతి దేశ కార్మికవర్గము ప్రపంచంలోని, తమ దేశంలోని వర్తమాన నిర్దిష్ట పరిస్థితులను మార్క్సిజం-లెనినిజం-మావోయిజం వెలుగులో శాస్త్రీయంగా విశ్లేషించాలి, లేని చోట అగ్రగామి కమ్యూనిస్టు పార్టీలను నిర్మించాలి, అవి బలహీనంగా ఉన్న చోట సంఘటితం చేయాలి, అధికార స్వాధీన దృక్పథంతో శత్రువు పై విప్లవ వర్గ పోరాటం కోసం తగిన పోరాట, నిర్మాణ రూపాలను కనుగొనాలి. అంతర్జాతీయ కార్మికవర్గ నిజమైన అగ్రగామి పార్టీలు, సంస్థల ముందు నేడు రెండు వ్యూహాత్మక కర్తవ్యాలు ఉన్నాయి. మొదటిగా ప్రతి దేశంలోనూ అక్కడి నిర్దిష్ట ఆర్థిక, సామాజిక పరిస్థితులు, సమాజ స్వభావం, అక్కడి వర్గాలు, వర్గ సంబంధాలు, అలాగే మౌలిక వైరుధ్యాలు, ప్రధాన వైరుధ్యాలను సరిగా విశ్లేషించి, అక్కడి విప్లవ కార్మికవర్గానికి సాధారణ రాజకీయ పంథాను రూపొందించాలి. ఈ రకంగా మాత్రమే కార్మికవర్గ పార్టీ మిత్రులను శత్రువులను సరిగా గుర్తించగలదు, వర్గ పోరాటానికి తగిన వ్యూహం ఎత్తుగడలను రూపొందించుకోగలదు, వర్గ శత్రువులకు వ్యతిరేకంగా ఐక్య వేదికలకు నాయకత్వం వహించగలదు. ఇలా చేయడం ద్వారా కార్మికవర్గం పెట్టుబడిదారీ-సామ్రాజ్యవాద దేశాలలో కార్మికుల, ఇతర పీడిత సెక్షన్‌ల విప్లవ ఉద్యమాలు ప్రారంభించగలదు. ప్రతి అర్ధ వలస, అర్ధ భూస్వామ్య దేశంలో కార్మికవర్గాన్ని, రైతాంగాన్ని, ఇతర ప్రజాస్వామిక వర్గాలను, సామాజిక సెక్షన్‌లనూ సంఘటితం చేసి, జాతీయ-ప్రజాస్వామిక ఉద్యమాలు ఇంకా ప్రారంభం కాని చోట వాటిని నిర్మించి నడిపించగలదు. ఇక రెండో వ్యూహాత్మక కర్తవ్యం ఏమంటే సామ్రాజ్యవాదానికి దాని దళారులకూ వ్యతిరేకంగా పెట్టుబడిదారీ దేశాల కమ్యూనిస్టు ఉద్యమాల, నయా వలస, అర్ధ వలస దేశాల జాతీయ-ప్రజాస్వామిక ఉద్యమాల బలమైన ఐక్యసంఘటనను నిర్మించాలి. ఇందుకోసం నిజమైన కార్మికవర్గ పార్టీలు, సంఘాలూ ప్రస్తుత నిర్దిష్ట పరిస్థితులకు అనుగుణంగా తగిన అంతర్జాతీయ విప్లవ కార్మికవర్గ సంస్థను నెలకొల్పడం అవసరం. అలాగే మావోయిస్టు శక్తులు ప్రతి ఒక్క దేశంలో ఉన్న సమస్త ప్రగతిశీల, ప్రజాస్వామిక శక్తులతో ఐక్యం కావడంతో పాటు ప్రపంచవ్యాప్త శత్రువుకు వ్యతిరేకంగా సమస్త సామ్రాజ్యవాద వ్యతిరేక, ప్రజాస్వామిక శక్తులతో ఐక్యం కావాలి. ఈ రెండు వ్యూహాత్మక కర్తవ్యాలూ పరస్పరం సంబంధం కలిగి ఉండి, ప్రపంచ సోషలిస్టు విప్లవాన్ని పురోగమింపజేయడంలో ముఖ్యమైన పాత్ర వహిస్తాయి.

మన దేశంలో విప్లవకర మార్క్సిస్టు పతాక కింద కార్మికవర్గం మరింత సంఘటితమై, సమస్త పీడిత వర్గాలను, సామాజిక సెక్షన్‌లను, వ్యక్తులను, ప్రస్తుతం బ్రాహ్మణీయ హిందూ ఫాసిస్టు శక్తుల నేతృత్వంలో ఉన్న పాలక వర్గ దాడికి వ్యతిరేకంగా ఉద్యమంలో ఐక్యం చేయాలి. దేశంలో విశాలమైన జాతీయ-ప్రజాస్వామిక ఉద్యమ ప్రవాహంలో భాగంగా ఐక్య ఉద్యమాన్ని నిర్మించవలసిన సమయం ఆసన్నమయింది. అతి కొద్ది మంది పాలక వర్గ పరాన్నభుక్కులను పక్కన పెడితే యావత్తు ప్రజలకూ అటువంటి ఉద్యమం తక్షణం అవసరం. అయితే కేవలం డిమాండ్‌లు లేవనెత్తితేనో, విమర్శలు చేస్తేనో, లేదా సాత్వికంగా, అసంఘటితంగా ప్రతిఘటిస్తేనో అది విజయవంతం కాదు. శత్రువు పై చివరి వరకు పోరాడేందుకు అణచబడ్డ, పీడిత ప్రజల స్వచ్ఛంద ఐక్యతా పునాది మీద సంఘటితం కావడం ద్వారానే ఈ ఉద్యమం పాలక వర్గాలను, వారిని నడిపిస్తున్న సామ్రాజ్యవాదులనూ విజయవంతంగా ఓడించగలదు, నిజమైన ప్రజాస్వామిక, సమాన, స్వతంత్ర, సౌభ్రాతృత్వ, స్వావలంబ, స్వచ్ఛ పర్యావరణ నూతన సమాజాన్ని నిర్మించగలదు, ప్రజల తీవ్ర సమస్యలను విప్లవ మార్గంలో పరిష్కరించగలదు. భారత కార్మికవర్గ అగ్రగామిగా మా పార్టీ ఈ కర్తవ్యాన్ని పరిపూర్తి చేయడంలో తన వంతు పాత్రకు నిజాయితీగా అంకితమై ఉన్నది.

గుత్తాధిపత్య బూర్జువా వర్గ సమర్థకులు, రివిజనిస్టులు, నయా రివిజనిస్టులతో సహా సమస్త ప్రతీఘాతుక వర్గాలూ కార్మిక ప్రజానీకాన్ని మోసపుచ్చడానికి ఏం చెప్పినప్పటికీ పదే పదే మరింత లోతైన సంక్షోభాలలో, వినాశకర యుద్ధాలలో దిగబడిపోయే పెట్టుబడిదారీ విధానంలో అంతర్గత వైరుధ్యాలను పరిష్కరించడం అసాధ్యం. మార్క్సిస్టు సిద్ధాంతం కానీ మార్క్స్, ఎంగెల్స్ నాటి నుంచి ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్న కమ్యూనిస్టు ఉద్యమం గానీ, పెట్టుబడిదారీ విధానం వర్గ సమాజ అభివృద్ధిలో ఒక పరివర్తన దశ అని, కమ్యూనిజం అనే ఒక నూతన, మరింత పురోగామి, ప్రగతిశీల, హేతుబద్ధ, న్యాయ సామాజిక వ్యవస్థ దాన్ని ఓడిస్తుందనీ చాలా స్పష్టంగా రుజువు చేసాయి. పెట్టుబడిదారీ విధాన అత్యున్నత దశయిన ఆధునిక సామ్రాజ్యవాదం కార్మికవర్గ విప్లవాల కాలమే. మార్క్సిజం చెప్పే ఈ మౌలిక బోధనను అర్థం చేసుకుని అంతర్జాతీయ కార్మికవర్గం తన చారిత్రక బాధ్యతను గ్రహించి, చేపట్టాలి, మాలెమా వెలుగులో సమస్త పీడిత వర్గాలు, సామాజిక సెక్షన్‌లనూ ఐక్యం చేసి విముక్తి పోరాటంలో వారిని నడిపించాలి.

మన దేశంలోను ప్రపంచంలోనూ కార్మికులు వివిధ రూపాలలో తమ ఆర్థిక డిమాండ్ల కోసం పోరాడుతున్నారు. పెట్టుబడిదారీ విధానం ఆవిర్భవించిన నాటి నుంచి అటువంటి పోరాటాలు జరుగుతూనే ఉన్నాయి. అయితే కార్మికవర్గం పాక్షిక డిమాండ్లకు మాత్రమే పరిమితమై పోరాడి, వేతన బానిసత్వాన్ని అంతం చేసే పోరాటంతో ముడిపెట్టకపోతే వారి ఆర్థిక, సామాజిక బానిసత్వానికి అంతం ఉండదని మార్క్సిజం బోధిస్తుంది. తాము చేసే పోరాటాన్ని ఆర్థికవాదం, సంస్కరణవాదం, రివిజనిజాలకు వ్యతిరేక పోరాటంగా, కార్మికవర్గ

నియంతృత్వాన్ని స్థాపించేందుకు రాజకీయాధికార స్వాధీన పోరాటాలుగా విస్తరించాలి.

కార్ల్ మార్క్స్ ద్విశతాబ్ది జయంతి సంవత్సరంలో మేడే సందర్భంగా, గత సంవత్సరాల అంతర్జాతీయ మేడే పిలుపుల స్ఫూర్తితో, మార్క్సిజాన్ని (నేటి మాలెమా)ను పీడిత వర్గ విముక్తికి ఏకైక సిద్ధాంతంగా పునరుద్ఘాటించవలసిందిగా మా పార్టీ కేంద్ర కమిటీ మన దేశ, ప్రపంచ కార్మికవర్గానికి పిలుపునిస్తున్నది. మార్క్సిస్టు బోధనలను లోతుగా అధ్యయనం చేయవలసిందిగాను, క్షుణ్ణంగా నేర్చుకుని గట్టి పట్టు సంపాదించవలసిందిగాను, విప్లవ వర్గ పోరాటంలో దాన్ని అన్వయించడంలో నైపుణ్యం సాధించవలసిందిగానూ విజ్ఞప్తి చేస్తున్నది. దీని వెలుగులో మనం ప్రపంచ సామ్రాజ్యవాద వ్యవస్థ, అందులో ఉన్న ప్రతి భాగంలో–పెట్టుబడిదారీ దేశాలు, నయా వలసలు, అర్థ వలసలలో నిర్దిష్ట పరిస్థితులను సరిగా విశ్లేషించాలి. పారిస్ కమ్యూన్, బోల్షివిక్కు విప్లవం, చైనా విప్లవం, మహత్తర కార్మికవర్గ సాంస్కృతిక విప్లవం, మన దేశంతో సహా సమస్త దేశాల విప్లవ, జాతి విముక్తి యుద్ధాలు, ప్రపంచ కార్మికవర్గ ఉద్యమాలన్నింటి పాజిటివ్, నెగిటివ్ పాఠాల నుంచి నేర్చుకోవాలి. వాటిని మన దేశ నిర్దిష్ట పరిస్థితులకు సరిగా సృజనాత్మకంగా అన్వయించాలి. ఇది అంతర్జాతీయ శ్రామిక దినం మనకు అందించే చారిత్రక కర్తవ్యం. మార్క్స్, గత శతాబ్ద కార్మికవర్గ విప్లవాలూ చూపించిన మార్గంలో ప్రపంచ పీడిత వర్గ పక్షపాతులుగా ఈ అంతిమ వర్గ యుద్ధంలో పాలు పంచుకుందాం, పోరాట పంథాలో ముందుకు సాగుదాం. 2022 నాటికి భారతదేశంలో మావోయిస్టు ఉద్యమాన్ని తుడిచిపెట్టేసే లక్ష్యంతో ప్రారంభమయిన నూతన విప్లవ ప్రతీఘాతుక 'సమాధాన్' పథకాన్ని ఓడించేందుకు గాను గెరిల్లా యుద్ధాన్ని తీవ్రతరం చేద్దాం, ప్రజలను సమీకరిద్దాం, ప్రజాపునాదిని విస్తరిద్దాం, పెంపొందిద్దాం, మన స్వీయాత్మక శక్తులను బలోపేతం చేద్దాం. అంతర్జాతీయ కార్మికవర్గ డిటాచ్‌మెంట్‌గా అంతర్జాతీయ గీతం పిలుపును సాకారం చేయడానికి మేడే సందర్భంగా మరోసారి శపథం చేద్దాం –

సంప్రదాయ సంకెళ్లు ఇక మనలను బంధించి ఉంచవు,

ఓ బానిసలారా లేవండి! ఇక ఏ బంధనాలూ మీకు అడ్డం లేవు!

ఈ ప్రపంచం నూతన పునాదుల మీద నిలబడుతుంది

మనమంతా కలిసి ఉన్నాం, కలిసే ఉంటాం

ఇది అంతిమ యుద్ధం,

ప్రతి ఒక్కరం మన వంతు కృషి చేద్దాం

అంతర్జాతీయ పార్టీ మానవ జాతిని రూపొందిస్తుంది.



**అభయ్**
**అధికార ప్రతినిధి**
**కేంద్ర కమిటీ**
**భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)**